
సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
శుక్రవారం 1-11-2024
సంపుటి: 20 సంచిక: 185
పేజీలు: 4 వెల: రూ.1

# గుడ్ ఈవెనింగ్ సి.ఎం. సర్..!



శిఖర సమాన వ్యక్తిత్వం, సమాజ శ్రేయస్సే అతని ధ్యేయం..
నిత్యకృషీవలుడు.. కాలంతో పోటీపడే తెలుగు సూరీడు..
ఆధునిక సాంకేతికతా వినియోగంలో యువతకు పోటీ అతడు..
కార్యసాధనలో, సమస్యా ఛేదనలో కిరీటికి సాటి అతడు..
విలువలెరిగిన నాయకుడు, పరిణతి చెందిన రాజనీతిజ్ఞుడు..
మన ముఖ్యమంత్రివర్యులు
శ్రీ **నారా చంద్రబాబునాయుడు** గారు
ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఉచిత గ్యాస్ సిలెండర్లు అందిస్తున్న
శుభ సందర్భంగా శ్రీకాకుళం విచ్చేసిన సర్‌కు శుభసాయంత్రం

## గొండు శంకర్, శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు

• ఎడిటోరియల్

# మోసాల్లోనూ గుజరాతే మోడల్


దేశంలో ఏ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని చెప్పుకోవాల్సి వచ్చిన ప్రతీసారి గుజరాత్ మోడల్‌నే మన నాయకులు చెబుతుంటారు. మోడీ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో గుజరాత్ వెలిగిపోయిందని, అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో దూసుకుపోయిందని చెప్పడానికి పర్యాయపదంగా గుజరాత్‌ను చెబుతుంటారు. ఇక్కడ ఏమేరకు అభివృద్ధి జరిగిందనేది పక్కనపెడితే.. ఈమధ్య గుజరాత్ మోసాలకు మోడల్‌గా నిలుస్తుంది. ఫేక్ కరెన్సీ సంఘటనలు దేశంలో చాలా జరిగాయి. కానీ, గుజరాత్‌లో జరిగింది మాత్రం హైలైట్. ఒకడు బంగారం షాప్‌కి వెళ్లి రెండు కిలోలు బంగారం కొన్నాడు. కోటి అరవై లక్షల నోట్ల కట్టలు ఇచ్చాడు. షాపోడు వాటిని కౌంటింగ్ మెషీన్లలో పెట్టి కౌంట్ చేసుకుని ఓకే చెప్పాడు, వీడు బంగారంతో వెళ్లిపోయాడు. తర్వాత షాపతనికి తెలిసిందేటంటే.. ఆ నోట్లకట్టల్లో పైన, కింద ఒరిజినల్ నోట్లు, లోపల మాత్రం నకిలీ నోట్లు ఉన్నాయి. నకిలీ అంటే ఎలా? కలర్ తేడానో, ప్రింటింగ్ తేడానో కాదు.. వాటిలో గాంధీ బొమ్మ స్థానంలో అనుపమ్ ఖేర్ ఓ సినిమాలో గాంధీ వేషం వేసిన బొమ్మ ప్రింట్ అయ్యింది. పాపం ఆ షాపోడి పరిస్థితేంటో చెప్పనక్కర్లేదు. గాంధీ నగర్‌లో మోరిస్ స్యామ్యూల్ అనేవాడు ఫేక్ కోర్టు, అంటే నకిలీ న్యాయస్థానం స్టార్ట్ చేసేశాడు. స్వయం ఉపాధి స్కీమ్ కింద సొంతంగా ఆఫీస్ తెరిచి, దానికి ముందు 'షెషన్స్ కోర్ట్' అని బోర్డ్ పెట్టాడు. జడ్జ్ కోట్ వేసుకుని, జడ్జ్ సీట్‌లో కూర్చుని 'ముద్దాయిని ప్రవేశపెట్టండి' అనగానే, పోలీసులు, లాయర్లు, బాధితులు అందరూ 'మాకు న్యాయం చేయండి', 'మాకు న్యాయం చేయండి' అంటూ ఇతని చుట్టూ మూగారు. ఇతను విచ్చలవిడిగా న్యాయం చేస్తూ పోయాడు. ఈ తతంగం ఐదేళ్లు అప్రతిహతంగా సాగింది. ఈ ప్రాసెస్‌లో మనోడు బాగానే ఆస్తులు, స్థలాలు, పొలాలు వెనకేసుకున్నాడు. వీని అభివృద్ధి చూసి కళ్లుకుట్టిన ఒరిజినల్ జడ్జిలు కంప్లైంట్ చేయడంతో వీడు చేసే న్యాయానికి అన్యాయం జరిగింది. గుజరాత్‌లోని బికనీర్–మోర్బీ హైవేపై ఓ టోల్‌ప్లాజా ఉంది. ఆ టోల్‌ప్లాజా వాహనదారుల నుంచి అధిక టోల్ వసూల్ చేయడాన్ని చూసి, ఆ పక్క గ్రామంలోని ధర్మేంద్ర సింగ్ జాలా అనే వ్యక్తి 'ఆపండి ఈ అన్యాయం' అని నినదించాడు. ఎవరూ ఆపకపోవడంతో, ఆ టోల్‌ప్లాజాకి సమాంతరంగా 600 మీటర్ల దూరంలో మరో టోల్‌ప్లాజా నిర్మించి, బారికేడ్స్‌లో వెహికల్స్ వెళ్లేంత ఓపెనింగ్ తెరిచి, మట్టి రోడ్డు వేసి, ఒరిజినల్ టోల్‌రేట్‌లో 80 శాతం డిస్కౌంట్ ఇచ్చాడు. ఇంకేముంది, వాహనాలన్నీ అటు వెళ్లడం మొదలైంది. ఈ తతంగం రెండేళ్లు గడిచాక గానీ టోల్ కంపెనీకి అసలు విషయం తెలీలేదు. ఇలా ఎలా జరిగింది అనే అనుమానం ఇంకా మిమ్మల్ని తొలుస్తుంటే.. దానికి హింట్, ఆ విలేజ్ సర్పంచ్ ఈ ధర్మేంద్ర సింగ్ భార్యే, వీరిద్దరు బీజేపీ నాయకులు. అదీ సంగతి. సందీప్ రాజ్‌పుత్ అనే మరో ట్యాలెంటెడ్ ఫెలో ఉన్నాడు. గుజరాత్‌లోని చోటా ఉదయ్‌పూర్ జిల్లా మోదేలీ తాలుకాలో, ఓ ప్రభుత్వ కార్యాలయం స్టార్ట్ చేసేశాడు. ఆదివాసీ సంక్షేమ పథకాల కింద ప్రభుత్వం ఖర్చు చేస్తున్న రూ.5 కోట్ల నిధుల్ని నొక్కేశాడు. కిరణ్ భాయ్ పటేల్ అనే మరో ప్రముఖుడు కాశ్మీర్ డీజీపీ ఆఫీస్‌కి వెళ్లి, తాను ప్రధానమంత్రి ఆఫీస్ నుంచి ఓ స్పెషల్ ఆపరేషన్ కోసం కాశ్మీర్ వచ్చానని, తనకు ఫెసిలిటీస్ ఏర్పాటు చేయమని చెప్పాడు. అంతే, ఆ తర్వాత నాలుగు నెలలు అక్కడి ఫైవ్‌స్టార్ హోటల్‌లో బస, జెడ్ ప్లస్ సెక్యూరిటీ, ఫుడ్డూ, బెడ్డూ మొత్తం ప్రభుత్వ లాంఛనాలతో ఎంజాయ్ చేశాడు. రాజ్‌కోట్ జిల్లా పిపాలియా గ్రామంలో కొందరు నిరుద్యోగ యువకులు ఓ ఫేక్ స్కూల్ స్టార్ట్ చేసి, ఆరేళ్ల పాటు మధ్యాహ్న భోజన నిధులు చక్కగా ఆరగించారు. సూరత్‌కి చెందిన హిమాన్షు రాయ్ కస్టమ్స్ ఆఫీసర్ అయ్యాడు. ఆరావలి జిల్లా బయడ్ తాలూకాకు చెందిన ప్రకాష్ నాయక్ డిప్యూటి కలెక్టర్ అయ్యాడు. హితేశ్వర్ సింగ్ మోరీ అనే బీజేపీ కార్పొరేటర్ సీబీఐ ఆఫీసర్ అయ్యాడు, భరత్ ఛాబ్డ్ ఐఏఎస్ అయ్యాడు, ప్రద్యుమన్ పటేల్ ఇంటెలిజెన్స్ బ్యూరో ఆఫీసర్, తరుణ్ భట్ సీఐడి ఆఫీసర్, లాకూష్ త్రివేది ఎస్ఐ, నిఖిల్ పటేల్ ఎస్ఐ, ఓం వీర్ సింగ్ ఈడీ, గుంజన్ కటారియా ఎన్ఐఏ, హిరాలీ కొరాడియా జిల్లా కలెక్టర్, నేహా పటేల్ డిప్యూటీ కలెక్టర్, పుఖ్రాజ్ రాయ్ సీబీఐ, విరాజ్ పటేల్ ఎస్ఐ.. అవసరాన్ని బట్టి ఇలా గుజరాత్‌లో ఫేక్ ఆఫీసర్లు పుట్టుకొస్తుంటారు. 2023 అక్టోబర్ 1 నుంచి 2024 సెప్టెంబర్ 30 మధ్య అమెరికాలోకి అక్రమంగా రావాలని ప్రయత్నించిన 90,415 ఇండియన్స్‌ని, అక్కడి బార్డర్ సెక్యూరిటీ పోలీసులు అరెస్టు చేసి, ఇండియాకు తిప్పిపంపారు. వీరిలో 50 శాతం మంది గుజరాతీలేనని బిజినెస్ స్టాండర్డ్ పత్రిక రాసింది. ఘుస్పేటియా (అక్రమచొరబాటులు) అనే పదం మోడి–అమిత్ షాలు ఎన్నికల ర్యాలీల్లో విరివిగా వాడుతుంటారు కదా, వీళ్లే ఆ ఘుస్పేటియాలు. ఇంత గొప్ప సమాచారం ఒకేచోట చేర్చింది మేం కాదు.. ఆ క్రెడిట్ 'న్యూస్‌ల్యాండ్రీ'కి దక్కుతుంది.

## అర్హులందరికీ పింఛన్లు అందిస్తాం

(సత్యంన్యూస్, పోలాకి)

అర్హులందరికీ సామాజిక భద్రత పింఛన్లు ఇంటివద్దనే అందిస్తామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. జడూరు గ్రామంలో స్వయంగా ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ కట్టుబడి ఉందన్నారు. అనంతరం సచివాలయం సిబ్బంది పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, కూటమి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.





పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ నీలమణి దుర్గమ్మ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొని అర్హులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, పాతపట్నం

## అమరజీవికి నివాళి

(సత్యంన్యూస్, లావేరు)

సమైక్య ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి



శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్షతో చేసిన ప్రాణత్యాగాన్ని జనవిజ్ఞాన వేదిక నాయకులు గురుగుబెల్లి బాలకృష్ణ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు గుర్తు చేశారు. శుక్రవారం అదపాక పాఠశాలలో పొట్టిశ్రీరాములుకు నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.శ్రీనివాసరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, స్టాఫ్ సెక్రటరీ పి.ఉదయ్ కుమార్, ఉపాధ్యాయులు ఎన్.కృష్ణారావు, పి.లక్ష్మణరావు, జి.మురళి, ఎ.వాసుదేవరావ్, బొడ్డేపల్లి జగన్నాధరావు, జి.రుద్రప్రతాప్, ఎంవీ కామేశ్వరరావు, పి.లక్ష్మి, ఎస్.రాజేశ్వరి, రామస్వామి, బిఏ నరసింహులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా పింఛను పండగ

- అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఇంట పింఛన్ పండగ వాతావరణం నెలకొందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. తండ్యాంవలస గ్రామంలో ఎమ్మెల్యే శంకర్ శుక్రవారం సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా ముందుకు సాగుతుందన్నారు. గత ప్రభుత్వంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతు మహిళలు పింఛన్ కోసం పడిగాపులు పడేవారని, చంద్రబాబు హయాంలో ప్రజలకు ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేసి పేదల కళ్లల్లో ఆనందం నింపుతున్నారని వివరించారు. సూపర్ సిక్స్ హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలుచేస్తూ ప్రజా ప్రభుత్వంగా ప్రజలతో మన్ననల్ని అందుకుంటుందని వివరించారు. దీపావళి కానుకగా ప్రజలకు ఉచిత సిలిండర్ అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

(సత్యంన్యూస్, పలాస)

ఈ నెల 9,10 తేదీల్లో పలాసలో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ సీనియర్ నాయకులు బమ్మిడి ఆనందరావు కోరారు. వజ్రపుకొత్తూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ సీపీఎం పార్టీ కార్మిక కర్షక, ప్రజల మౌలిక సమస్యలపై నిరంతరం పోరాడుతుందన్నారు. ప్రజాధనంతో నిర్మించుకున్న ప్రభుత్వ రంగాన్ని నేడు బీజేపీ నిర్వీర్యం చేస్తుంటే, దానిని నిలబెట్టుకోవడానికి సీపీఎం నికరంగా కార్మికుల పక్షాన ఉండి పోరాడుతుందని వారన్నారు. అనేక సమస్యలపై పోరాటాల కోసం గతాన్ని సమీక్షించుకుంటూ, భవిషత్ కార్యాచరణను ఈ మహాసభలలో రూపొందించనున్నట్టు తెలిపారు. మహాసభల సందర్భంగా 9వ తేదీన ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని కార్మికులు, కర్షకులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో టి.భాస్కరరావు, ఎన్.మోహనరావు, ఎన్.చంద్రయ్య, బి.రామకృష్ణ పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలో జరగబోవు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ హాకీ పోటీలకు శ్రీకాకుళం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల గిరిజన విద్యార్థులు సవర జయకృష్ణ, సవర చందు విద్యార్థులు అండర్–17 విభాగంలో ఎంపికయ్యారు. ఈమేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ ఎం.వాసుదేవ ఆచారిలు ఒక ప్రకటన విడుదల చేస్తూ తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విషయం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సీతంపేట గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు అన్నదొర, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.






**కథ: అభినయ వాసుదేవ్ (కిరణ్ అబ్బవరం) ఒక అనాథ. చిన్నప్పుడు అనాథాశ్రమంలో పెరిగిన అతడికి వేరే వాళ్ల ఉత్తరాలు చదివే బలహీనత ఉంటుంది. తల్లిదండ్రులు-తోబుట్టువుల ప్రేమకు నోచుకోని అతను.. ఈ ఉత్తరాల ద్వారానే ఆ అనుబంధాల గురించి తెలుసుకుంటాడు. ఈ ఉత్తరాలు చదివే అలవాటుతోనే అతను పోస్ట్ మ్యాన్ అవ్వాలని ఆశపడతాడు. యుక్త వయసుకు వచ్చాక కృష్ణగిరి అనే ఊరిలో అతడికి అసిస్టెంట్ పోస్ట్ మ్యాన్ పని చేసే అవకాశం దక్కుతుంది. దీంతో రోజూ ఆ ఊరికి వచ్చే ఉత్తరాలన్నీ తెరిచి చదివి.. ఆ తర్వాత వాటిని యథావిధిగా అంటించి అందాల్సిన వాళ్లకు ఇచ్చేస్తుంటాడు. కానీ తన అలవాటు వల్ల వాసుదేవ్ కొన్ని సంచలన విషయాలు తెలుసుకుంటాడు. ఈ క్రమంలోనే ఆ ఊరిలో అదృశ్యం అవుతున్న అమ్మాయిల గుట్టును తెలుసుకునే ప్రయత్నం చేస్తాడు వాసుదేవ్. దీంతో అతడికి పెద్ద సమస్యలు మొదలవుతాయి. ఈ సమస్యలేంటి.. ఈ అమ్మాయిల అదృశ్యం వెనుక ఉన్నదెవరు.. వారిని వాసుదేవ్ పట్టుకున్నాడా.. ఈ విషయాలన్నీ తెర మీదే తెలుసుకోవాలి.**

'ఎస్ఆర్ కళ్యాణమండపం' సహా కొన్ని చిత్రాలతో మంచి గుర్తింపు సంపాదించి.. తర్వాత వరుస ఫ్లాపులతో వెనుకబడ్డ యువ కథానాయకుడు.. ఈసారి కొంచెం గ్యాప్ తీసుకుని 'క' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ప్రామిసింగ్ టీజర్.. ట్రైలర్ ఈ సినిమాపై అంచనాలు పెంచాయి. దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఆ అంచనాలను ఏమేర అందుకుంది..? చూద్దాం పదండి.

# కంటెంట్ ఉన్న థ్రిల్లర్!

### కథనం- విశ్లేషణ:

సెబాస్టియన్.. నేను మీకు బాగా కావాల్సిన వాడిని.. మీటర్.. రూల్స్ రంజన్.. మామూలు డిజాస్టర్లు కావివి. రెండేళ్ల వ్యవధిలో కిరణ్ అబ్బవరం నుంచి వచ్చిన కళాఖండాలివి. సోషల్ మీడియా ట్రోల్స్‌ను సమర్థించడం కాదు కానీ.. కిరణ్ సినిమా అనగానే ప్రేక్షకులు లైట్ అనుకునే పరిస్థితి రావడానికి అతను ఎంచుకున్న సినిమాలే కారణం. కానీ అదే హీరో 'క' అనే కొత్త చిత్రం టీజర్ తో పలకరిస్తే.. గతం అంతా మరిచిపోయి ఇదేదో మంచి ప్రయత్నంలా ఉందే అని ఆసక్తి కనబరిచారు ప్రేక్షకులు. ట్రైలర్ చూస్తే ఈసారి కిరణ్ గట్టిగానే కొట్టబోతున్నాడనే ఫీలింగ్ కలిగింది. సినిమా చూశాక ప్రోమోల్లో చూపించినవి పైపై మెరుపులు కావని అర్థమవుతుంది. మలయాళంలో మిస్టరీ థ్రిల్లర్లను చూసి ఇలాంటి ప్రయత్నాలు తెలుగులో ఎందుకు జరగవు అనుకుంటూ ఉంటాం. అందుకు సమాధానమే.. 'క'. పల్లెటూరి నేపథ్యంలో ఒక థ్రిల్లర్ కథను బిగితో చెప్పి రెండున్నర గంటల పాటు ప్రేక్షకులను కుదురుగా కూర్చోబెట్టగలిగారు దర్శక ద్వయం సుజిత్ మద్దెల–సందీప్ మద్దెల. ఎలాంటి కథను చెప్పినా విజువల్‌గా కొత్తగా ఉండేలా చూసుకోవడం.. ప్రేక్షకులకు విభిన్న అనుభూతిని పంచేలా ఒక 'వరల్డ్' క్రియేట్ చేయడం ఇప్పుడు ట్రెండ్. తమకు ఉన్న బడ్జెట్ పరిమితుల్లో కిరణ్ అబ్బవరం స్థాయికి తగ్గట్లే పల్లెటూరి నేపథ్యంలో ఇలాంటి 'వరల్డ్'నే క్రియేట్ చేసుకుని నీట్‌గా ఓ థ్రిల్లర్ కథను నరేట్ చేశారు సుజిత్–సందీప్. రొటీన్ అనిపించే కథలను కూడా నరేట్ చేసే శైలి ద్వారా కొత్తగా అని పించేలా చేయొచ్చు. 'క'లో కూడా అదే జరిగింది. 'క' ట్రైలర్లో చూపించిన ముసుగు వ్యక్తి తాలూకు వ్యవహారం గురించి ఎక్కువ మాట్లాడితే కథలో ట్విస్టును బయటపెట్టేసినట్లు అవుతుంది కాబట్టి దాని లోతుల్లోకి వెళ్లకూడదు. కానీ సినిమాలో గమ్మత్తు అంతా దాంతోనే ముడిపడి ఉంది. చుట్టూ కొండల మధ్య లోతులో ఉండే ఒక ఊరు. మధ్యాహ్నం మూడు గంటలకే చీకటి పడిపోయే ఆ ఊరిలో వరుసగా అమ్మాయిలు అదృశ్యం అవుతుంటారు. అది కూడా తెల్లవారుజామునే వారి జాడ కనిపించకుండా పోతుంది. ఆ ఊర్లోకి వచ్చే ఓ పోస్ట్ మ్యాన్ ఈ మిస్టరీని ఎలా ఛేదించాడన్నది 'క' కథ. ఈ కథను మొదలుపెట్టిన తీరు మామూలుగానే అనిపిస్తుంది. ఓ పావుగంట సాధారణంగా గడిచాక 'క' ట్రాక్ ఎక్కుతుంది. వేరే వాళ్ల ఉత్తరాలు చదివి బంధాల విలువ తెలుసుకునే అనాథగా హీరో క్యారెక్టరైజేషన్ ఆసక్తి రేకెత్తిస్తుంది. ఇలాంటి అలవాటున్న వాడు పోస్ట్‌మ్యాన్ కావడం.. అందరి ఉత్తరాలూ చదవడం.. ఈ క్రమంలో సంచలన విషయాలు వెల్లడి కావడం.. ఈ నేపథ్యంలో కథ ఆసక్తికరంగా నడుస్తుంది. 'క' ప్రథమార్థం కొంచెం ఎగుడుదిగుడుగా సాగినా.. ఇంటర్వెల్ నుంచి మంచి టెంపోతో నడుస్తుంది. కథలో అనేక లేయర్స్ ఉండడంతో ప్రేక్షకులు తర్వాత ఏం జరుగుతుందా అన్న ఆసక్తితో ముందుకు సాగుతారు. ట్విస్టులు ఒకదాని తర్వాత ఒకటి రివీలవుతుంటే ప్రేక్షకులు ఉత్కంఠకు గురవుతారు. విలన్ తాలూకు ట్విస్ట్ కంటే.. హీరో పాత్రకు ఇచ్చిన ట్విస్ట్ చివర్లో హైలైట్‌గా నిలుస్తుంది. అది ప్రేక్షకులు ఊహించలేరు. ఇక హీరో పాత్రకు ఇచ్చిన ముగింపు.. 'క–2'కు ఇచ్చిన లీడ్ కూడా బాగున్నాయి. ముగింపులో 'క' లెవెల్ మారుతుంది. కిరణ్ అబ్బవరం చెప్పినట్లే ఈసారి కంటెంట్ ఉన్న సినిమాతో వచ్చాడు. తన కెరీర్లో ఇది బెస్ట్ ఫిలిం అనడంలో సందేహం లేదు.

– తుపాకి.కామ్ సౌజన్యంతో

### నటీనటులు:

కిరణ్ అబ్బవరం నటన గురించి మాట్లాడే ముందు ఇలాంటి కథను ఎంచుకుని సినిమా చేసినందుకు తన జడ్జిమెంట్ కు అభినందించాలి. ఇక అభినయ వాసుదేవ్ పాత్రలో లుక్.. నటన పరంగా కూడా అతను ఆశ్చర్యపరుస్తాడు. ఈ సినిమా నడిచే కాలానికి.. పాత్రకు తగ్గ ఆహార్యంతో కనిపించిన కిరణ్.. నటనలోనూ మెప్పించాడు. పాత్ర బాగుంటే నటన కూడా అందుకు తగ్గట్లే సాగుతుందనడానికి ఈ సినిమా రుజువుగా నిలుస్తుంది. గత సినిమాల్లో తేలిపోయిన కిరణ్ ఈసారి ఇంపాక్ట్ చూపించాడు. ద్వితీయార్థంలో కిరణ్ పాత్ర.. తన పెర్ఫామెన్స్ ప్రత్యేకంగా నిలుస్తాయి. 'ఆయ్' ఫేమ్ నయన్ సారిక మరోసారి తన క్యూట్ లుక్స్.. నటనతో ఆకట్టుకుంది. తన మేకప్ చాలా బాగుంది. మరో కీలక పాత్రలో మలయాళ అమ్మాయి తన్వి రామ్ బాగా చేసింది. విలన్ పాత్రల్లో నటించిన ఇద్దరూ ఓకే. కన్నడ నటుడు అచ్యుత్ కుమార్ తన పాత్రను బాగా పోషించాడు. తమిళ కమెడియన్ రెడిన్ మాత్రం వేస్టయ్యాడు. శరణ్య ప్రదీప్.. ఆమె తండ్రిగా చేసిన నటుడు బాగా చేశారు.

### సాంకేతిక వర్గం:

టెక్నికల్‌గా 'క'లో మంచి క్వాలిటీ కనిపిస్తుంది. సామ్ సీఎస్ ఈ చిత్రానికి తెర వెనుక హీరో. థ్రిల్లర్ సినిమాలకు అదిరిపోయే ఆర్ఆర్ ఇస్తాడని పేరున్న అతను.. 'క'లో అదరగొట్టేశాడు. ఒక డిఫరెంట్ థీమ్ తో సాగే ఆర్ఆర్ సినిమాలో ప్రేక్షకులను ఇన్వాల్వ్ చేయించడంలో కీలక పాత్ర పోషించింది. తన పాటలు జస్ట్ ఓకే. జాతర పాట మంచి ఊపుతో సాగుతుంది. సతీష్ రెడ్డి–డేనియల్ విశ్వాస్ అందించిన ఛాయాగ్రహణం బాగుంది. విజువల్స్ డిఫరెంటుగా అనిపిస్తాయి. ఆర్ట్ వర్క్ బాగా చేశారు. నిర్మాణ విలువలు ఈ సినిమా స్థాయికి మించే ఉన్నాయి. ఇక కథ–స్క్రీన్ ప్లే రాయడంతో పాటు సినిమాను డైరెక్ట్ చేసిన సుజిత్–సందీప్.. తమ టాలెంట్ చూపించారు. సినిమా మొదలైన తీరు కొంచెం కృత్రిమంగా అనిపిస్తుంది కానీ.. తర్వాత ప్రేక్షకులను ఈ కథలో బాగానే ఇన్వాల్వ్ చేయగలిగారు. ఉత్కంఠ రేకెత్తించే స్క్రీన్ ప్లేతో థ్రిల్లర్ కథను ఆసక్తికరంగా చెప్పారు. రైటింగ్ తో పాటు టేకింగ్‌లోనూ సుజిత్–సందీప్ బలమైన ముద్ర వేశారు.



ఆరుగాలం కష్టించి.. చీడపీడలతో సరైన దిగుబడుల్లేక.. వచ్చిన కాస్త దిగుబడులకు మార్కెట్‌లో కనీస గిట్టుబాటు ధరల్లేక.. అసలు పెట్టుబడులే వెళ్లక అప్పులు చేయక తప్పని పరిస్థితి అన్నదాతది. అన్నపూర్ణ వంటి దేశంలో అన్నదాతల ఆత్మహత్యలు సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసేవి. అయితే సమాజ పోకడలను బట్టి మనుషులు మారాలి, అలాగే రైతులు కూడా. అదిగో అలా వినూత్న శైలితో వ్యవసాయ రంగాన్ని పర్యాటక రంగంతో మిళితం చేసి సక్సెసైనవాడే పాండురంగ్ తవారే!! అంతేనా..? తన అగ్రిటూరిజం ప్రాజెక్ట్‌తో తనను నమ్ముకున్న 600 మంది రైతులను లాభాలబాట పట్టించి.. వారి వ్యవసాయ ఉత్పత్తులకు 58 కోట్ల రూపాయల ఆదాయాన్నందించిన ఘనత ఆ పాండురంగణిది. మరి ఆ ఫాదర్ ఆఫ్ అగ్రిటూరిజం మ్యాన్ కథేంటో ఓసారి తెలుసుకుందామా..!

## సాగును బాగుచేసి 600 మంది రైతుల తలరాతను మార్చాడు!!

# తవారే.. ఫాదర్ ఆఫ్ అగ్రిటూరిజం!

దేశమంటే మట్టికాదోయ్.. మనుషులోయ్ అన్నారు గురజాడ. అలాగే దేశమంటే కేవలం పట్టణాలు, పైపైన కనిపించే సొబగులే కాదు.. పల్లెప్రగతీ ముఖ్యమేనన్నాడు మహాత్ముడు. భారత్ అంటే ఏ ఢిల్లీనో, ముంబయ్యో, హైదరాబాదో మాత్రమే కాదు.. 7 లక్షల గ్రామాల సముదాయం ఈ దేశం. అలాగే 145 కోట్ల జనాభా కలిగిన ఈ దేశంలో రైతుల సంఖ్యే కనీసం 15 కోట్ల నుంచి 20 కోట్ల వరకు ఉంటుందంటే.. వ్యవసాయరంగంపై ఈ దేశం ఏ స్థాయిలో ఆధారపడిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమూ లేదు!

వ్యవసాయం ఏమంత ఈజీ కాదు. తన పని తానేదో చేసుకుని పోతానంటే రైతుకు అస్సలు కుదరని పని. ఎందుకంటే రుతుపవనాల రాక.. అతివృష్టి, అనావృష్టి, నాణ్యమైన విత్తనాల కొరత, నకిలీ విత్తనాల బెడద, చీడపీడలు, తెగుళ్లు, పంటల యాజమాన్య పద్ధతులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు.. సబ్సిడీలు, డ్రిప్ వంటి సౌకర్యాలు, సాంకేతిక యుగంలో అందిపుచ్చుకున్న హార్వెస్టింగ్ పద్ధతులు, ప్రభుత్వ విధానాలు, మార్కెట్ పరిస్థితులు.. ఇలా ఎన్నో ప్రభావితం చేస్తూ అన్నదాతను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. ఈ క్రమంలో ఓవైపు దేశంలో రైతుల బలవన్మరణాలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్న నేపథ్యంలోనే.. వినూత్న పద్ధతుల్లో సాగును బాగుచేసి చూపించే పాండురంగ తవారే వంటి విశిష్ఠ వ్యక్తుల అవసరం ఈ సమాజానికి ఎంతైనా ఉంది.

మహారాష్ట్రలోని బారామతి జిల్లా షాంగవికి చెందిన ఓ రైతు కుటుంబంలో పుట్టినవాడు 52 ఏళ్ల పాండురంగ తవారే. పాండురంగ చదివించి కంప్యూటర్ సైన్స్ అయితే.. ఆయన తండ్రికి మాత్రం అగ్రికల్చర్‌లో డిగ్రీ చదివించాలనే ఉండేదట. కానీ సరైన మార్కుల్లేక, ఆ కోర్సుకు ఎంపిక కాని పాండురంగ కంప్యూటర్ సైన్స్ వైపు వెళ్లిపోయాడు. కానీ అక్కడా అనుకున్న సంతృప్తి పొందలేని పాండురంగ.. ఆ తర్వాత 20 ఏళ్లు పర్యాటక రంగంలో పనిచేశాడు. అలా ఆ పనిలోనూ సంతృప్తి పొందని పాండురంగ తిరిగి ఇంటికి వెళ్లిపోవాలని తీర్మానించుకున్నాడు. తన తండ్రికిష్టమైన వ్యవసాయం చేయాలన్న కోరిక మొదలైంది. 13 ఎకరాల పొలముంది.. అక్కడ వ్యవసాయం చేసుకుంటూ ఇంటిపట్టున ఊళ్లో అందరితో హాయిగా ఉండొచ్చన్నది పాండురంగ యోచన. కానీ, పాండురంగ భార్య వైశాలి పట్టణవాసి కావడంతో.. మొదట్లో ఆమె అంత సుముఖత వ్యక్తం చేయలేదు. కానీ భర్త మాట కాదనలేక భర్త పాండురంగతో పాటే అత్తగారైన షాంగవికి వచ్చేసింది. ఇప్పుడు ఫాదర్ ఆఫ్ అగ్రిటూరిజం మ్యాన్‌గా పేరు గడించడానికి, 19 ఏళ్లుగా తన భార్య తన వెంటుండి నడవడమే కారణమంటాడు పాండురంగ తవారే. కేవలం 32 ఏళ్ల వయస్సులో రియలైజైన పాండురంగ ఐరోపాలో చాలా కాలంగా నడుస్తున్న అగ్రిటూరిజం భావనను ఇక్కడ కూడా అమలు చేయాలన్న ఐడియాతో తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. అలా 2002 నుంచి ఆయన ప్రస్థానం కొత్త మలుపు తీసుకుంది. అగ్రిటూరిజం అనే కాన్సెప్ట్‌ను తవారే ఏమంత ఆషామాషీగా ప్రారంభించలేదు. 2003లో మార్కెట్ శాంపిల్ సర్వే నిర్వహించాడు. సుమారు 2,440 మంది రైతులతో కలిశాడు. ఎట్టకేలకు వారందరితో కలిసి అగ్రిటూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ప్రారంభించాడు. తాను ఈ అగ్రిటూరిజమనే కాన్సెప్ట్‌ను ప్రారంభించినప్పుడు తనపై విశ్వాసమైతే ఉంచారుగానీ.. అగ్రిమెంట్స్‌పై సైన్ చేసిన రైతులందరికీ ఈ విధానమేంటో అస్సలర్థమవ్వడమే కష్టమైందంటాడు తవారే.

### అసలేంటీ ఈ అగ్రీటూరిజం?

దూరపు కొండలు నునుపు అన్నట్టుగా ఎప్పుడూ పట్టణాల్లో మెకానికల్ లైఫ్ గడించేవారికి పల్లె ప్రకృతంటే ఒకింత మమకారం. ఆ క్రమంలో వ్యవసాయ భూముల్లో చేసే పనులవంటివీ తామూ చేస్తే బాగుండనిపించే వాళ్లూ ఉంటారు. ఈ అనుభూతి కోసం కేవలం దేశంలోని పట్టణవాసులే కాకుండా.. విదేశాల నుంచి వచ్చే వారూ పరితపిస్తుంటారు. అదిగో అలాంటివారు ఇదిగో పాండురంగ తవారే ప్రారంభించిన అగ్రిటూరిజం కాన్సెప్ట్‌లో భాగంగా రైతుల వ్యవసాయ క్షేత్రాలను సందర్శించవచ్చు. అక్కడ రైతులెలాగైతే సాగు చేస్తారో వచ్చిన పర్యాటకులూ ఆ పని చేసి ఆ ప్రకృతిసిద్ధమైన అనుభూతిని పొందవచ్చు. అంతేకాదు.. తద్వారా ఆ వ్యవసాయ క్షేత్రాల్లో రైతులు పండించిన దిగుబడులనూ కొనుక్కొని వెళ్లవచ్చు. ఇలా పర్యాటకంగా వారికి ఓ ఆనందాన్నివ్వడంతో పాటే.. ఇటు రైతుల ఉత్పత్తులను వారి క్షేత్రాలనే సందర్శించిన పర్యాటకులు కొనుగోలు చేయడం వల్ల మార్కెట్ కష్టాలకూ చెక్ పడుతుంది. ఇదిగో ఇలాంటి ఆలోచనలే పాండురంగ తవారేను అగ్రిటూరిజం వైపు అడుగులు వేయించింది.

అయితే మొత్తం నలుగురన్నదమ్ములు, ఇద్దరు అక్కాచెల్లెళ్ల మధ్య ఉమ్మడి కుటుంబంలో పుట్టిన పాండురంగ తవారే అమ్మా, నాన్నకు తప్ప వ్యవసాయంలో ఎవ్వరికీ పెద్దగా అనుభవం ఉండేది కాదు. పైగా తను పర్యాటక రంగంలో పనిచేస్తున్న క్రమంలో కూడబెట్టుకున్న 6 లక్షల రూపాయల డబ్బును కూడా తాను ప్రయోగాత్మకంగా ప్రారంభించిన అగ్రీటూరిజంలో పెట్టుబడిగా పెట్టాడు పాండురంగ. తాను రైతులను ఒప్పించి ప్రారంభించిన అగ్రిటూరిజం కాన్సెప్ట్‌ని ప్రమోట్ చేయడానికి తన దగ్గరున్నదంతా ప్రకటనల కోసం కుమ్మరించేశాడు. అయినా కొంతకాలం నిరాశే ఎదురైంది. 2005లో గానీ తమకు ఒక మొదటి కస్టమర్ నుంచి కాల్ రాని పరిస్థితి. అయితే 2006లో పాండురంగ తవారే చేపట్టిన అగ్రిటూరిజం కాన్సెప్ట్ దశ తిరిగింది. పూణే నుంచి వచ్చిన 4వేల మంది మహిళా సభ్యుల బృందం సందర్శించాక ఇక అప్పటి నుంచీ తన కాన్సెప్ట్‌లో వెనక్కి తిరిగి చూసుకోలేదు. కేవలం 18 నెలల కాలంలోనే తన అగ్రిటూరిజం దశ మారిపోయింది. పర్యాటకులు ఆసక్తి చూపడం మొదలెట్టారు. ఆ తర్వాత 13వేల మంది వరుసగా వారి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు.

ద్రవ్యోల్బణం పట్టిపీడించే రోజుల్లో కేవలం వ్యవసాయోత్పత్తులతో వచ్చే ఆదాయంతో తమ కుటుంబాలు నడవలేని దైన్యస్థితిలో, పాండురంగతో అనుబంధం తమ బతుకుచిత్రాన్నే మార్చేసిందంటారు భోర్ తాలూకాలోని నస్రాపూర్‌కు చెందిన కృష్ణాపదార్తే వంటి ఎందరో రైతులు. ఇప్పుడు తమ ఆదాయం ఐదు రెట్లు పెరిగిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు అక్కడి అన్నదాతలు. అంతేకాదు వచ్చే టూరిస్ట్స్ నుంచి కూడా అందే సూచనలనూ పరిగణనలోకి తీసుకుని ఎంతో నేర్చుకుంటామంటున్నారు షాంగవి రైతులు. పాండురంగ తవారే నిర్వహణలోని అగ్రిటూరిజంకు ఓ పర్యాటకుడిగా వెళ్లాలంటే.. మొత్తం 1500 రూపాయలు ఒక్కో టూరిస్టుకి ఖర్చవుతుంది. దాంతో రెండుసార్లు నాణ్యమైన సేంద్రీయ పద్ధతిలో పండించిన పంటల భోజనం, అల్పాహారం, సాయంత్రం టీ, స్నాక్స్‌తో పాటు.. రాత్రిపూట కూడా పొలంలో గడిపేందుకు వసతి ఇలా అన్నీ అందిస్తారు. అలా తవారే వ్యవసాయ పర్యాటకం వైపు మళ్లితే.. పచ్చని ప్రకృతి, ఎడ్లబండ్లు, ట్రాక్టర్ రైడ్, పతంగులేగరేయడం, నాణ్యతతో కూడిన ప్రామాణికమైన ఆహారం, సంప్రదాయ దుస్తులు, స్థానిక సంస్కృతి, జానపద పాటలు, నృత్యాల వంటివి ఆస్వాదించడంతో పాటు అక్కడ రైతులు పండించే నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆరోగ్యాన్నీ పొందొచ్చు. వారికింత లాభమూ చేయొచ్చు. అందుకే పాండురంగ తవారే అగ్రిటూరిజం కాన్సెప్ట్ ఇప్పుడు దేశవ్యాప్త మన్ననలందుకుంటోంది. ఆయన కృషికి జాతీయ, అంతర్జాతీయ ప్రశంసలు లభించాయి. అలా 2008-09, 2013-14లో రెండు జాతీయ పురస్కారాలను కూడా అందుకున్నారు పాండురంగ. టెడ్ ఎక్స్ టాక్ షోలోనూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి పాండురంగ విధానాల్ని విన్నవారు మంత్రముగ్ధులయ్యారు.

అగ్రిటూరిజంపై పాండురంగ కాన్సెప్ట్‌ను సందర్శించడానికి.. మహారాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖను ఆదేశించింది. ఐదవ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థినీ, విద్యార్థులను ప్రతీ సంవత్సరం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పాండురంగ అగ్రిటూరిజం ఫీల్డ్‌ను సందర్శించాలని ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలకిప్పటికే ఆదేశాలుండగా, ఈ లెక్కన దాదాపు కోటిమంది పాఠశాలల విద్యార్థులు ఈ ఫీల్డ్స్‌ను సందర్శించనున్నారు.

సేవార్త్ మధే పరమార్థ్ - ఇదే పాండురంగ తవారే జీవిన విధానం. అంటే మీకు మాత్రమే కాకుండా మీ చుట్టుపక్కల వారికి కూడా ప్రయోజనం చేకూర్చే ప్రయోజనకారులుగా బతకండన్నది పాండురంగడి మోటో! రాబోయే రోజుల్లో పాండురంగ తవారే తన అగ్రిటూరిజం భావనను దేశంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించేలా ఇప్పటికే ప్రణాళికలు మొదలుపెట్టాడు. విష్ యూ ఆల్ ది బెస్ట్ సార్!!

- రమణ కొంటికర్ల

## సభ్యత్వ నమోదు 5 లక్షలు దాటింది



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

తెలుగుదేశం పార్టీ సభ్యత నమోదు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 5 లక్షలు దాటిందని, ప్రజలు, పార్టీ కుటుంబ సభ్యులు అద్భుతంగా సహకరిస్తున్నారని పార్టీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ అన్నారు. తమకు పార్టీ సభ్యత్వం ఎంతో గొప్పదని, నేడు తాము ఇంత పదవులు, ప్రజాదరణ పొందుతున్నామంటే పార్టీ సభ్యత్వమే కారణమని అరసవల్లిలో సభ్యత్వం తీసుకుంటున్నవారు తెలిపారని వెంకటేష్ అన్నారు. ప్రతీఒక్కరూ పార్టీ సభ్యత్వం కార్యక్రమంలో పాల్గొని సభ్యత్వం తీసుకొని తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడానికి, పార్టీ ఆశయాలు సిద్ధాంతాలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చెందే విధంగా సహకరించాలని కోరారు.

## రైల్వేగేటు వద్ద ఆటో బోల్తా

(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

సోంపేట మండలం బారువ రైల్వేగేటు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో 12మందికి గాయలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఐదుగురిని పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కంచిలి మండలం పి.శాసనాంకు చెందిన కూలీలు ఆటోలో వెళుండగా ఈ ప్రమాదం జరిగింది.

### టెక్కలి జిల్లా ఆసుపత్రికి క్షతగాత్రులు

బారువ జంక్షన్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బారువ పంచాయతీ దాసరిగూడెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆటోలో కూలీలకు తెస్తున్న సమయంలో బారువ సమీపంలో ఆటో టైరు ఊడిపోవడంతో బోల్తాపడినట్లు తెలుస్తుంది. ఘటనలో 12 మంది గాయపడగా, సోంపేటలో చికిత్స అందిస్తున్నారు. అందులో తీవ్రంగా గాయపడిన ఐదుగురిని చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు.



## అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఇంట పింఛన్ పండగ వాతావరణం నెలకొందని టీడీపీ ఉపాధ్యక్షులు తోణంగి వెంకన్న యాదవ్ అన్నారు. హయాతినగరంలో శుక్రవారం సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా ముందుకు సాగుతుందన్నారు. సూపర్ సిక్స్ హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వంగా ప్రజలతో మనల్ని అందుకుంటుందని, దీపావళి కానుకగా ప్రజలకు ఉచిత సిలిండర్ అందజేయడం ఆనందంగా ఉందని, త్వరలోనే తల్లికి వందనం పింఛన్ కూడా అందించి మహిళలను అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## సంతోషిమాతకు ప్రత్యేక పూజలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఆశ్వయుజ బహుళ అమావాస్యను పురస్కరించుకొని సంతోషిమాత అమ్మవారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా పాత శ్రీకాకుళం అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, క్షీరాభిషేకం, సహస్త్ర నామార్చన, కుంకుమ పూజ, అమ్మవారి జపం, లలితా సహస్రనామ పారాయణం ఆలయ ప్రధాన అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు.

## స్వర్ణాంధ్ర సాధన చంద్రబాబుకే సాధ్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

స్వర్ణాంధ్ర సాధన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు అన్నారు. పట్టణంలోని రెండో డివిజన్ ఇన్‌ఛార్జి అక్కిన రాజారావు ఆధ్వర్యంలో శుక్రవారం పింఛన్లు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవడానికి 18 ఏళు వయస్సు నిండిన ఓటర్లందరూ క్యూ కడుతున్నారని, చంద్రబాబుపై నమ్మకంతో రాష్ట్ర అభివృద్ధి కోరుకునేవారందరూ పార్టీలకతీతంగా టీడీపీ సభ్యత్వం కోసం ఆసక్తి చూపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో జగన్, కార్తీక్, నాని, రమణ, సచివాలయ సిబ్బంది స్వరూప్, రాధ, హారిక తదితరులు పాల్గొన్నారు.



























# 10వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్

- ✔ పలాస, టెక్కలిలో అనుకూలమైన చోట విమానాశ్రయం
- ✔ తప్పుచేసిన వారిని వదిలిపెట్టను
- ✔ రౌడీయిజం, నేరాలు చేస్తే కబడ్దార్
- ✔ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ప్రారంభించిన సీఎం చంద్రబాబు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మూలపాడు వద్ద 10వేల ఎకరాలతో ఇండస్ట్రియల్ కారిడర్ ఏర్పాటు చేస్తున్నట్టు సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకాన్ని ప్రారంభించిన అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలో ఒక ఎయిర్‌పోర్టు నినిర్మిస్తున్నట్టు ప్రకటించారు. శ్రీకాకుళం, ఇచ్ఛాపురం మధ్యలో భోగాపురం ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీ ఉండేలా టెక్కలి, పలాసల్లో అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేసి విమానాశ్రయాన్ని నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. తాను సమాజంపై బాధ్యత కలిగిన వ్యక్తినని, నాయకుడంటే ప్రజల మనసుల్లో ఉండాలన్నారు. తన సభలకు బలవంతపు తరలింపులు, చెట్లు తొలగింపు, పరదాలు, ఆడంబరాలు ఉండవన్నారు. మొన్న ఎన్నికల్లో చెడు మీద మంచి గెలిచిందని, 93 శాతం స్ట్రైక్ రేట్ గెలిచామని, పార్టీ పెట్టిన తర్వాత 40



ఏళ్లకు పెద్ద గెలుపు సాధించామని, రాజీలేని పోరాటం చేసి రాష్ట్రాన్ని కాపాడుకున్నామన్నారు. రాక్షసత్వంతో అరెస్టులు చేశారని, తన అరెస్టుపై 80 దేశాల్లోని తెలుగు ప్రజలు స్పందించారని, కార్యకర్తల బాధ, మనోభావాలను అర్థం చేసుకుంటున్నానని, తప్పు చేసినవారిని వదిలిపెట్టనని, రాజకీయ కక్షసాధింపులకు పాల్పడనన్నారు. ఇటీవల కొందరు ఇష్టానుసారంగా ఎగిరెగిరిపడుతున్నారని అన్నారు. వారంతా ప్రజాస్వామ్య ముసుగులో రౌడీయిజం, నేరాలు చేస్తానంటే చూస్తూ ఊరుకొనేది లేదని, రాజకీయ ముసుగులో అరాచకాలు సృష్టించే వారికి కబడ్దార్ అని హెచ్చరించారు. రాష్ట్రంలో కుప్పం, హిందూపురం తర్వాత ఇచ్ఛాపురం, టెక్కలి టీడీపీకి కంచుకోటలన్నారు.

### మహిళల కోసం

మహిళల ఖర్చులు తగ్గించే దిశగా ఆలోచన చేసి ఏడాదికి మూడు సిలెండర్లు ఉచితంగా అందించాలని నిర్ణయించానని, మహిళలకు స్వేచ్ఛ రావాలని, ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ప్రపంచానికి డ్వాక్రా సంఘాలను ఆదర్శంగా నిలిచేలా రూపకల్పన చేశానని, డ్వాక్రా సంఘాలు బలోపేతం చేసి ఆయా కుటుంబాలను ఆర్థికంగా పరిపుష్టి కల్పించే చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వంలోని పార్టీలు ఇచ్చిన హామీ మేరకు ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ ప్రారంభించామన్నారు. ఆడబిడ్డల కష్టాలు తీర్చాలని టీడీపీ హయాంలో దీపం పథకం తీసుకు వచ్చి పేదలందరికీ ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చినట్టు తెలిపారు. డబ్బులు కట్టే అవసరం లేకుండా ఉచితంగా మూడు సిలిండర్లు ఇచ్చేందుకు చమురు సంస్థలతో మాట్లాడుతున్నామని, జిల్లావ్యాప్తంగా మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వడానికి రూ.122 కోట్లు కాగా, ఇచ్ఛాపురం మండలంలో రూ.4.65 కోట్లు ఖర్చవుతున్నట్టు తెలిపారు.

### ఇంటివద్దకే పింఛను

దేశంలో ఎక్కువ పింఛన్లు ఇచ్చిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని రోజుల్లోనే పింఛన్లను పెంచి కమిట్‌మెంట్‌తో ఇచ్చామన్నారు. దేశంలో అత్యధికంగా పింఛను డబ్బులు ఇస్తున్నది కూటమి ప్రభుత్వమేనన్నారు. మూడు నెలల వరకు స్వేచ్ఛగా పింఛను తీసుకునే అవకాశం కల్పించినట్లు ప్రకటించారు. లబ్ధిదారులు ఇంటివద్దకు వచ్చి పింఛన్ ఇవ్వకుంటే చర్యలు తీసుకుంటానని ఉద్యోగులను హెచ్చరించారు.



### నిధులు మళ్లించారు

గత ఐదేళ్లలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయిపోయాయని, అధికారులు నిర్లప్తతతో పనిచేశారన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులు, అప్పులుగా తెచ్చిన డబ్బులు దారి మళ్లించారని తెలిపారు. అధికారంలోకి వచ్చి 143 రోజులు అనునిత్యం ప్రజల కోసం ఆలోచన చేస్తున్నానని, గత ప్రభుత్వం చేసిన అప్పునకు ఏడాదికి రూ.లక్ష కోట్లు చెల్లించాల్సి వస్తుందని, గత ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టారని ఆరోపించారు. సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండి, విలువలు, పద్ధతులు పాటించాలన్నారు. ప్రజలకు న్యాయం చేస్తూ కార్యకర్తలను అన్యాయం జరగకుండా చూసుకోవల్సిన బాధ్యత తనపై ఉందన్నారు.

### ఇసుకలో జోక్యం వద్దు

మద్యం, ఇసుక దోపిడీ చేశారని, ఉచితంగా ఇసుక ఇవ్వాలని నిర్ణయించి తమ్ముళ్లు ఎవరూ ఇందులో జోక్యం చేసుకోవద్దని ఆదేశించి స్వేచ్ఛగా ఇసుక తవ్వుకొనే అవకాశం ఇచ్చానన్నారు. నాశిరకం మద్యానికి ఫుల్‌స్టాప్ పెట్టి నాణ్యమైన మద్యం అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టామన్నారు. బెల్ట్‌షాపులు తెరిస్తే బెల్ట్ తీస్తానని, మద్యం వ్యాపారులు తమాషాలు చేయొద్దని, ఎక్కువ రేట్లకు మద్యం విక్రయిస్తే మొదటిసారి అపరాధ రుసుము, రెండోసారి లైసెన్స్ రద్దు చేస్తానని హెచ్చరించారు. అక్రమ ఇసుకను తరలిస్తే పీడీ చట్టం కింద కేసు నమోదు చేస్తామన్నారు.

### అమరావతి పూర్తి చేస్తాం

అమరావతి రాజధాని రిఫరండంగా ఎన్నికల్లో గెలిచామని, విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తామని, శ్రీకాకుళం రుణం తీర్చుకోవాల్సి ఉందన్నారు. అమరావతి నిర్మాణానికి కావాల్సిన వనరుల సమీకరణ పూర్తి చేసామని, జనవరి నుంచి పనులు ప్రారంభమవుతాయని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం నిధులు ఇచ్చి ఉత్పత్తి ప్రారంభించిందని, దీన్ని కాపాడే బాధ్యత తీసుకుంటున్నానని అన్నారు. ల్యాండ్‌టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేసి గత ప్రభుత్వం దోపిడీని అడ్డుకున్నామని, చేతివృత్తిదారుల ఆదాయం పెంచే చర్యలు తీసుకున్నామన్నారు. గ్రామాల్లో ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో 30వేల పనులకు శ్రీకారం చుట్టామని, గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయడానికి రూ.880 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. విశాఖ రైల్వే జోన్‌కు లైన్ క్లియర్ చేశామన్నారు. గృహనిర్మాణదారుల బకాయిలను చెల్లిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు భూమి ఇచ్చి ఇళ్లు కట్టి ఇస్తామన్నారు. జిల్లా అంతటా ఐదేళ్లలో ప్రతి ఇంటికీ కుళాయి ఇస్తామన్నారు.



### ఈదుపురానికి హామీల జల్లు

ఈదుపురం గ్రామానికి సీఎం చంద్రబాబు హామీల జల్లు కురిపించారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆయన దృష్టికి తీసుకువచ్చిన అన్ని సమస్యలకు పరిష్కరిస్తామన్నారు. వీటికి రూ.30 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. కొబ్బరి పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలో ప్రతి ఇంటి మీద 200 నుంచి 300 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి



చేసుకొనే సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానల్ అమర్చుకునేలా సాయం చేస్తామన్నారు. వీటి ఏర్పాటుకు గ్రామ ప్రజలంతా ముందుకు రావాలని ఈదుపురం ప్రజలకు పిలుపునిచ్చారు. తన పర్యటనకు గుర్తుగా దీన్ని అందరూ ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

### గ్యాస్ వెలిగించి.. టీ చేసి

ఇచ్ఛాపురం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా హెలిప్యాడ్ నుంచి ఈదుపురంలో మహిళా లబ్ధిదారు అంబటి శాంతమ్మ ఇంటికి వెళ్లి ఉచిత గ్యాస్ సిలిండర్ అందజేశారు. అనంతరం స్వయంగా గ్యాస్‌ను బిగించి స్టవ్ వెలిగించి టీ చేసి మంత్రులతో కలిసి తాగారు. ఆ తర్వాత శాంతమ్మ కుటుంబ సభ్యులతో కొన్ని నిమిషాల పాటు ముచ్చటించారు. అనంతరం ఒంటరి మహిళ బడేపల్లి జానకి ఇంటికి వెళ్లి ఒంటరి మహిళ పింఛను అందజేశారు. ఆ కుటుంబానికి రూ.2లక్షలు ఆర్థిక సాయం ప్రకటించి, ప్రభుత్వం ద్వారా ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంటిని తక్షణమే మంజూరుచేసి వెంటనే పనులు ప్రారంభించాలని కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు.


సమావేశంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కింజరాపు అచ్చెన్నాయుడు, ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు బెందాళం ఆశోక్, గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావు, గౌతు శిరీష, నడికుదిది ఈశ్వరరావు, రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రత్యేక రాష్ట్రం సాధించిన మహనీయుడు

**- అమరజీవికి భారతరత్న ప్రకటించాలి**
**- పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి డిమాండ్**
**- పొట్టిశ్రీరాములుకు ఘన నివాళి**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

58రోజుల పాటు నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసి భాషాప్రయుక్త రాష్ట్రాల్లో భాగంగా తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అట పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి శ్రీకాకుళం అధ్యక్షులు తమ్మన భాస్కర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలోని అమరజీవి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమ్మన భాస్కర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు వంటి మహనీయుని త్యాగానికి నివాళులు అర్పించడం ప్రతి తెలుగు వాడి బాధ్యతని గుర్తు చేశారు. అంతటి మహనీయుని త్యాగానికి గుర్తుగా ప్రభుత్వం ఆయనకు భారతరత్న బిరుదు ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండవిల్లి స్వామి శ్రీనివాస్ గుప్తా, కాపుగంటి సంతోష్, వివిఎల్ నరసింహం, మాటూరు దీపక్, పొట్టా వెంకటరమణ మూర్తి, శంభాన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## హైస్కూల్‌లో అమరజీవికి నివాళి

(సత్యంన్యూస్, పాలకొండ)

అమరజీవి పొట్టి శ్రీరాములుకు పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘన నివాళులు అర్పించారు. హెచ్ఎం మీసాల సూర్యనారాయణ అమరజీవి చిత్రపటానికి పూలమాలలతో అలంకరించారు. సంస్కృత ఉపాధ్యాయులు బౌరోతు శంకరరావు అమరజీవి త్యాగచరిత్ర వివరించారు. ఈ కార్యక్రమంలో వరిష్టోపాధ్యాయులు అనంతరావు, బాబూరావు, నారాయణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## పింఛన్ల పంపిణీలో మన జిల్లాయే ఫస్ట్!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణిలో శ్రీకాకుళం జిల్లా మొదటిస్థానంలో నిలిచింది. జిల్లాలో 3,14,385 మంది పింఛన్‌దారులుండగా తొలిరోజైన శుక్రవారమే 2,57,238 మందికి పింఛన్లు పంపిణీ చేసి 81.82శాతంతో శ్రీకాకుళం మొదటిస్థానంలో నిలిచింది. తిరుపతి జిల్లా 81.2శాతం పింఛన్ల పంపిణీలో నిలవగా ఈ జిల్లాకు పక్కన గల విజయనగరం జిల్లా 79.57శాతం పింఛన్ల పంపిణీతో మూడవస్థానంలో నిలిచింది. అటు పక్కన గల విశాఖపట్నం జిల్లా 64.53శాతం పింఛన్ల పంపిణీతో 17వ స్థానంలో నిలిచింది. కాగా కాకినాడ జిల్లా 43.58శాతం పింఛన్లను పంపిణీ చేసి చివరిస్థానంలో నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా శ్రీకాకుళంలోనే అత్యధికమంది పింఛన్‌దారులు ఉండగా అధికారులు, పాలకులు కూడా అదేస్థాయిలో పని చేసి మొదటిరోజునే అధికశాతం పింఛన్లు పంపిణీ చేసే విధంగా తగిన ప్రణాళికలు రూపొందించుకున్నారు. జిల్లాలో గల గ్రామాలతోపాటు పట్టణాల్లో కూడా అధికారులు, కూటమి ప్రభుత్వ నాయకులు పాల్గొని ఇంటింటికి వెళ్లి త్వరితగతిన పింఛన్లు పంపిణీ చేశారు. వెనుకబడిన ప్రాంతాల్లో కూడా అధికారులు, పాలకులు శ్రమించి మరీ పింఛన్‌దారుల ఇంటికి వెళ్లి పింఛన్ అందజేశారు.

| S.No | District | Physical Progress: No. of Pensions Released | No. of Pensions Disbursed | Percentage of Disbursement | Financial Progress: Amount Released (Rs.) | Amount Disbursed (Rs.) | Percentage of Disbursement |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 1 | SRIKAKULAM | 314385 | 257238 | 81.82 | 1283066500 | 1048061000 | 81.68 |
| 2 | TIRUPATI | 265488 | 215588 | 81.2 | 1123727500 | 910537000 | 81.03 |
| 3 | VIZIANAGARAM | 277107 | 220492 | 79.57 | 1158034500 | 916499000 | 79.43 |
| 4 | ANANTHAPURAMU | 282984 | 223643 | 79.15 | 1239952500 | 978707000 | 78.89 |
| 5 | KRISHNA | 238249 | 183978 | 77.22 | 1010908500 | 779626500 | 77.12 |
| 6 | YSR | 259715 | 199181 | 76.77 | 1104785500 | 845976000 | 76.61 |
| 7 | ALLURI SITHARAMA RAJU | 124354 | 94911 | 76.32 | 517950000 | 394921000 | 76.25 |
| 8 | ANNAMAYYA | 220170 | 166197 | 75.49 | 929014000 | 701573000 | 75.23 |
| 9 | CHITTOOR | 268021 | 195670 | 73.01 | 1131063000 | 823019000 | 72.77 |
| 10 | KURNOOL | 241029 | 172932 | 71.75 | 1026896000 | 733249000 | 71.44 |
| 11 | ANAKAPALLI | 259778 | 185645 | 71.08 | 1073309000 | 760659500 | 70.89 |
| 12 | NANDYAL | 217375 | 153976 | 70.83 | 918622000 | 648474500 | 70.59 |
| 13 | SRI POTTI SRIRAMULU NELLORE | 308759 | 216169 | 70.01 | 1306136500 | 917355500 | 69.85 |
| 14 | BAPATLA | 229635 | 156248 | 68.04 | 956179000 | 644628000 | 67.36 |
| 15 | SRI SATHYA SAI | 266137 | 178968 | 67.25 | 1142666000 | 764507500 | 66.91 |
| 16 | WEST GODAVARI | 229184 | 153252 | 66.87 | 961942500 | 643068000 | 66.85 |
| 17 | VISAKHAPATNAM | 161989 | 104511 | 64.53 | 689953500 | 447071000 | 64.76 |
| 18 | PARVATHIPURAM MANYAM | 141800 | 90372 | 63.73 | 589497500 | 374898500 | 63.6 |
| 19 | ELURU | 263768 | 165613 | 62.79 | 1127407500 | 707758000 | 62.73 |
| 20 | NTR | 231961 | 143444 | 61.84 | 979390000 | 604803500 | 61.75 |
| 21 | PALNADU | 275070 | 168338 | 61.2 | 1174033000 | 717005500 | 61.06 |
| 22 | PRAKASAM | 287127 | 174450 | 60.76 | 1222193500 | 740303000 | 60.58 |
| 23 | EAST GODAVARI | 238196 | 143961 | 60.44 | 1016298500 | 612643500 | 60.28 |
| 24 | GUNTUR | 255258 | 143808 | 56.34 | 1087196500 | 610835000 | 56.14 |
| 25 | Dr.B.R. AMBEDKAR KONASEEMA | 239368 | 115128 | 48.1 | 994408500 | 477613500 | 48.03 |
| 26 | KAKINADA | 274740 | 119737 | 43.58 | 1156394500 | 502517500 | 43.46 |
| 27 | ART (Pensions) | 42577 | 42526 | 99.88 | 171908000 | 171704000 | 99.88 |
| | Total | 6414174 | 4385557 | 68.37 | 27100635000 | 18478534500 | 68.18 |

## సీఎంను కలిసిన ఎమ్మెల్యే శంకర్

(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

ఉచిత సిలిండర్ల పంపిణీ కార్యక్రమానికి జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే గొండు శంకర్ శుక్రవారం ఈదుపురం హెలిప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎంను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.



## 3న పసుమర్తి శతజయంతి ఉత్సవాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రముఖ సామాజికవేత్త, ఉద్యమకారుడు పసుమర్తి రామారావు శతజయంతి ఉత్సవాలు ఈనెల 3న ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక బ్లూవెర్త్ హోటల్‌లో ప్రారంభమవుతాయని కార్యక్రమ నిర్వాహకులు పసుమర్తి రామ్ మనోహర్, రాజేష్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ ఎం.వి.రమణరావు, ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు, పత్రికా రచయిత జంధ్యాల శరత్‌బాబు, నామ విజ్ఞానవేత్త వాండ్రంగి కొండలరావు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె.మూర్తిలు పాల్గొంటారని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

## ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్‌ను వినియోగంలోకి తేవాలి

(సత్యంన్యూస్, రాజాం)

రహదారులు భవనాల వసతి గృహాన్ని తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని మాజీమంత్రి, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. సోమవారం రాజాంలో అధికారులతో కలిసి ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్‌ను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేసి వినియోగంలోకి తేవాలన్నారు. నిధులు ఇంకా అవసరం అయితే మంజూరు చేస్తామన్నారు. ఆయన వెంట జేఈ నాగభూషణరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు గురవాన నారాయణరావు, ధనుంజయ్, అప్పలనాయుడు, హరి తదితరులు ఉన్నారు.



## ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

**- నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు స్వాతిశంకర్**
**- రాఘవేంద్ర ఆలయంలో నిత్య అన్నదానం ప్రారంభం**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని టీడీపీ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతిశంకర్ అన్నారు. బలగ వద్ద ఉన్న రాఘవేంద్ర స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి భక్తులకు 41 రోజుల పాటు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ముందుగా రాఘవేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతి శంకర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎదుటివారిని గౌరవించడం, పేదలకు తోచిన విధంగా సాయపడటం అలవర్చుకోవాలన్నారు. ఆధ్యాత్మికత తగ్గిపోవడంతోనే ప్రజలు మానసిక రుగ్మతలకు గురై ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అనేక సమస్యలకు మానసిక ఒత్తిడే మూల కారణమని, పోటీ ప్రపంచంలో మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రజలు ఆలయాన్ని సందర్శించి ప్రశాంతతను పొందాలని ఆమె తెలిపారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ఆకలి తీరిన ప్రతి వ్యక్తి ఎంతో సంతోషంతో ఆశీస్సులు అందిస్తారని అన్నారు. ఆమెతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అయ్యప్ప స్వామి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.